క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శుల కు ఘన సన్మానం



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న హరితను, బదిలీపై గ్రామానికి వచ్చిన నూతన పంచాయతీ కార్యదర్శి పరశురాముడిని గురువారం జూపల్లి యువసేన నాయకుడు విష్ణు ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామాభివృద్ధిలో తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కారోబార్ ఆంజనేయులు, యువసేన నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పెబ్బేరు రూరల్: మండలంలోని బునాదిపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు 20 మంది గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరేందర్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి చిన్నారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎద్దుల విజవర్ధన్‌రెడ్డి, రణధీర్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, పాతపల్లి శేఖర్, సూగూరు శివ, అచ్చన్న నాయుడు, కురుమన్న, మురళి, విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శ



పాన్‌గల్: మండలంలోని రేమద్దులకు చెందిన బీఆర్‌ఎస్, హర్షన్న యువసేన నియోజకవర్గ నాయకుడు రంగాపురం శివారెడ్డి సతీమణి స్వప్న (35) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ నాయకులు వెంకటయ్యనాయుడు, దామోదర్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి, యాదగిరిచారి, వీరసాగర్, రవీందర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత




పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన ఫక్రుద్దీన్ పెబ్బేరు పట్టణంలోని మెట్రో టెంట్‌హౌస్‌లో పనిచేస్తూ గత నెలలో బైక్ ప్రమాదంలో కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబం ఆర్థికంగా వెనుకబడి ఉండడంతో ఆ కుటుంబానికి పెబ్బేరు పట్టణానికి చెందిన మైనార్టీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రూ.14,500వేల ఆర్థికసాయం అతడి భార్యకు అందించారు. కార్యక్రమంలో జామే మజీద్ కమిటీ సభ్యులు ఎండీ అప్సర్, మజీద్, మొయినుద్దీన్, కుత్బుద్దీన్, అబ్దుల్ హుస్సేన్, బద్రుద్దీన్, ఇమ్రాన్, గౌస్ పాల్గొన్నారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ

పెద్దకొత్తపల్లి: గంట్రావ్‌పల్లి ఉన్నత పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్ సభ్యుడు హరితమోహన్ కూతురు సామోయశ్రీ జన్మదిన సందర్భంగా 8, 9వ తరగతి విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అధ్యక్షుడు రాఘవేందర్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పవన్, శివుడు, హుస్సేన్, కురుమయ్య, గౌస్‌పాషా పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు



కర్నె శ్రీహరి

కొల్లాపూర్: జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం నిర్వహించారు. అధ్యక్ష పదవికి ఎన్నిక నిర్వహించగా, మిగతా పదవులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కర్నె శ్రీహరి విజయం సాధించారు. ఉపాధ్యురాలిగా ఎస్.రామలక్ష్మమ్మ, ప్రధాన కార్యదర్శిగా పిరంగి గోవిందు, కోశాధికారిగా నిరంజన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది కాలంపాటు ఈ కమిటీ కొనసాగుతుంది. అసోసియేషన్ గౌరవ, మర్యాదలు పెంచేందుకు కృషిచేస్తానని అధ్యక్షుడు వెల్లడించారు.

తాగునీటికి కటకట



బస్వాపురంలో తాగునీటి ట్యాంకు వద్ద ప్రజలు

చిన్నంబావి మండల జనాభా 29,196		
కుటుంబాలు 6,788	బోరుబావులు 78	పని చేసేవి 47
భూగర్భ జలాలు అడుగంటిన బోర్లు 31	ప్రతిరోజు కావాల్సిన నీరు 28.220 లక్షల లీటర్లు	
అందుతున్న నీరు 24.400 లక్షల లీటర్లు	కొరత 4 లక్షల లీటర్లు	
చెరువులు 9	వాటర్ ట్యాకులు 36	చేతి పంపులు 59
పనిచేయనివి 33		

- సక్రమంగా సరఫరా రానీ 'భగీరథ' నీరు
- బోరు బావుల్లో అడుగంటిన భూగర్భ జలాలు
- ముందస్తు చర్యలకు నిధుల మంజూరు



చిన్నంబావి: రోజురోజుకూ ఎండలు తీవ్రత పెరుగుతుండడంతో బావి, బోరు బావి, చేతిపంపుల్లోని భూగర్భ జలాలు అడుగంటాయి. వేసవి ప్రారంభంలోనే మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. గ్రామాల్లో అరకొర ఉన్న చేతిపంపులు, బోరుబావుల వద్ద బారులు తీరాల్సిన పరిస్థతి నెలకొంది. రూ.కోట్లు ఖర్చు చేసి మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైప్ లైన్ల ద్వారా ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చినా వాటి ద్వారా ఎన్ని రోజులకు నీటి సరఫరా అవుతాయో తెలియని పరిస్థితి. గ్రామంలో ఉన్న బావులు ఎండిపోవడం, బోరుబావులు సైతం వట్టిపోవడంతో కొంత మేర చేతిపంపులతో తాగనీటి దప్పికను తీర్చుకుంటున్నారు.

మండలంలో పరిస్థితి

మండలంలోని 17గ్రామపంచాయతీలుండగా 14 గ్రామ పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నెలకొందని పంచాయతీ అధికారులు తెలిపారు. వెల్టూరు, కొప్పునూరు, అయ్యవారిపల్లి, చిన్నమారు, బస్వాపురం, గూడెం గ్రామాల్లో తీవ్రంగా నీటి ఎద్దడి నెలకొంది. ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు కనిష్ఠ మట్టానికి పడిపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వెలగొండ, మియాపూర్, పెద్దమారు గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉంది. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం మంత్రి ప్రత్యేక దృష్టితో రూ.50.96లక్షల నిధులను మంజూరు చేయడంతో అధికారులు తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు.

తిప్పలు పడుతున్నాం



కొన్ని రోజుల నుంచి తాగు నీటి కోసం చాలా తిప్పలు పడుతున్నాం. ఉదయం లేచినప్పటి నుంచి తాగు నీటి కోసం పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తోంది. గ్రామంలో ఉన్న బోర్లలో నీరు రాకపోవడంతో ఉన్న ఒక్క బోరుబావి ద్వారా ఊరందరికీ నీటి సరఫరా చేయడం ఇబ్బందిగా ఉంది. – బొజ్జన్న, చిన్నంబావి

తాగునీరు సరఫరా లేదు



పేరుకే మిషన్ భగీరథ ట్యాంకులు, పైప్‌లైన్లు ఊరికి దిష్టిబొమ్మల దర్శన మిస్తున్నాయి. ఒకవైపు బోరుబావులు, చేతిపంపులు ఎండిపోతున్నా.. అధికారులు పట్టించుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. రోజు కూలీ పనులు చేసుకునే మేము తాగునీటి కోసం మూడు నాలుగు గంటలు కష్టపడాల్సి వస్తోంది. – బీసన్న, బస్వాపురం

ముందస్తు చర్యలు చేపడుతున్నాం



మండలంలో 17 పంచాయతీల్లో 14 గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య ఉందని గుర్తించాం. దీంతో ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యల కోసం రూ.50.96లక్షల నిధులతో ప్రత్యేక ప్రణాళిక ద్వారా తాగనీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. తాగునీటి సమస్య ఎక్కువ ఉంటే నీటి ట్యాంకుల ద్వారా తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు ప్రయత్నిస్తాం. – రమణరావు, ఎంపీడీఓ, చిన్నంబావి



గూడెం గ్రామంలో తాగునీటి కోసం క్యూలైన్‌లో నిలుచున్న జనాలు (ఫైల్)

కొనసాగుతున్న 'పది' పరీక్షలు



పాన్‌గల్ పదో తరగతి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో గురువారం పదో తరగతి జీవశాస్త్రం పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్లు అజీమ్ పాష, సురేష్, డిపార్టుమెంటల్ అధికారులు రాజవర్ధన్‌రెడ్డి, మంజుల తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలల్లో 220 మంది, బాలికల ఉన్నత పాఠశాలల్లో 143 మంది కలిపి మొత్తం 363 మంది విద్యార్థులకు వంద శాతం విద్యార్థులు హాజరైనట్లు వారు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ వేణు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆస్పత్రి కార్మికులకు వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న ఆస్పత్రి కార్మికులు

ఆత్మకూర్: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని గురువారం ఆత్మకూర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద కార్మికులతో కలిసి నిరసన తెలిపడంతో పాటు వైద్యాధికారికి సమ్మె డిమాండ్ నోటీసు అందజేశారు. ఏడు నెలలుగా సంబంధిత కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని మండిపడ్డారు. శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులకు జీఓ 60 ప్రకారం రూ.15,600 ఇవ్వాల్సి ఉండగా అందులో కోతలు పెడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సంబంధిత కాంట్రాక్టర్ వెంకటయ్య ఏజెన్సీ నిర్వాహకులు కోతలు పెట్టడంతో పాటు గతేడాది ఆగస్టు నుంచి ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోరింగ్ శ్రీనివాస్, కార్మికులు బాలరాజు, పార్వతమ్మ, నాగమ్మ, సత్తార్, భరత్, మోహినిద్దీన్, చెన్నమ్మ, బాలకిష్టమ్మ, శైలజ, వెంకటేష్, తిరుపతమ్మ, లక్ష్మి, అరుణ్ తదితరులు ఉన్నారు.

సెగ్రిగేషన్ షెడ్ల వినియోగమేదీ?

- కనపడని కంపోస్టు ఎరువు తయారీ
- షెడ్లలో చెత్త రీసైక్లింగ్ ఊసేలేదు
- ప్రతి జీపీలో రూ. 2.5లక్షలతో నిర్మాణం
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- పట్టించుకోని అధికారులు, ప్రభుత్వం



షేక్‌పల్లిలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెలను స్వచ్ఛగ్రామాలుగా మార్చేందుకు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా గ్రామాల్లో సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసి పంట పొలాలకు అవసరమయ్యే కంపోస్ట్ ఎరువులను తయారీ చేయడం కోసం ప్రభుత్వం ప్రతి జీపీలో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నప్పటికీ కొందరి అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల గ్రామాల్లో అమలు కావడం లేదు. దీంతో ఆయా గ్రామాల నుంచి సేకరించిన చెత్తా చెదారాన్ని గ్రామ శివారులో, రోడ్ల పక్కన ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. దీనివల్ల పంచాయతీల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వం లక్షలు ఖర్చుపెట్టినా అవి ప్రజలకు సక్రమంగా ఉపయోగపడటం లేదని పలువురు పేర్కొంటున్నారు.

నీరు గారుతున్న ప్రభుత్వ లక్ష్యం..

తెలంగాణ ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి పంచాయతీకి రూ.2.5 లక్షల నిధులు కేటాయించింది. ప్రతి జీపీల్లో సెగ్రిగేషన్ సెడ్‌ను నిర్మించి గ్రామం నుంచి సేకరించిన తడి, పొడి చెత్తలను వేరుచేసి వానపాముల ద్వారా సేంద్రియ ఎరువులను తయారు చేయాలని సూచించింది. ఎరువు తయారీ పనులు నేటికీ ప్రారంభం కాలేదు.

నాణ్యతలేని కంపోస్టు ఎరువు..

పల్లెల అభివృద్ధిలో భాగంగా అలంపూర్ నియోజకవర్గంలోని 124 గ్రామ పంచాయతీలలో సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్‌యార్డుల నిర్మాణ పనులను పూర్తి స్థాయిలో చేపట్టారు. ఇందులో ఒక్కో సెగ్రిగేషన్ షెడ్‌కు ప్రభుత్వం రూ. 2.5 లక్షలను కేటాయించి పనులను పూర్తి చేయించింది. నియోజకవర్గంలోని 124 జీపీలకు గాను కేవలం 88 షెడ్లలో మాత్రమే కంపోస్టు ఎరువును తయారుచేస్తున్నారు. వీటిలో కూడా ఎరువు సక్రమంగా తయారు కావడం లేదని రైతులు వాపోతున్నారు. మిగిలిన 36 షెడ్లలో కూడా ఇప్పటి వరకు వానపాములు అందుబాటులోకి రాలేదు.

'మామిడి' రైతులకు పరిహారం ఇవ్వాలి

వీపనగండ్ల: మండలంలో వేలాది ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేసిన రైతులు 90 శాతం దిగుబడిని కోల్పోవడంతో రూ.లక్షల్లో నష్టపోయి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని, వారికి వెంటనే పరిహారం అందివ్వాలని సీపీఎం నాయకులు బాల్‌రెడ్డి, మహబూబ్‌పాషా, ఆశన్న, నర్సింహులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలోని గోవర్ధనగిరి, సంగినేనిపల్లి, కల్వరాల, వీపనగండ్ల తదితర గ్రామాల్లో ఎకరా మామిడి తోట కోసం రూ.50 వేల వరకు ఖర్చు చేశారన్నారు. పంట దిగుబడి పడిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు



గోపాల్‌పేట: రేవల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ లక్ష్మీదేవి, ఆర్‌ఐ శేఖర్ ఆధ్వర్యంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వచ్చే సిబ్బందికి, రోడ్డుపై ప్రయాణించే వారికి చలివేంద్రం ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఇఫ్తార్ విందు



ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు గురువారం రాత్రి స్థానిక మస్‌జిదే నూర్‌లో డాక్టర్ బ్రహ్మారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలాన అబ్దుల్‌అలీంరషాది ప్రపంచశాంతి కోరుతు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ ముజీబుర్‌రహ్మాన్, డాక్టర్ ముబష్షీర్‌రహ్మాన్, నవీద్, మోసీన్, రజాఖ్, తౌఫీఖ్, అశ్రఫ్, జియా ఉర్‌రహ్మాన్, ఇమ్రాన్, వాహిద్, ముస్లిం పెద్దలు, దీక్షపరులు పాల్గొన్నారు.

ప్రకృతిపై అవగహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల సమీపంలో ఉన్న ఫారెస్ట్ ఏకో పార్కులో అధికారులు గేమ్యానాయక్ తండా పాఠశాల విద్యార్థులకు నేచర్ స్టడీ క్యాంప్– ఫారెస్టు అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా అవగహన కల్పించారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సద్గుణ

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ సద్గుణ ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఇదివరకు నిరుపయోగంగా ఉన్న చేతి పంపులకు మరమ్మతు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో పంచాయతీ ట్యాంకర్ ద్వారా ప్రతి వార్డుకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఎండలు అధికంగా ఉండటంతో ఉపాధి హామీ కూలీలను ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు మాత్రమే పని చేయించాలన్నారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలు, నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం



రేవల్లి మండలంలోని చెన్నారంలో అవగాహన కల్పిస్తున్న సభ్యులు



కేతేపల్లిలో..



ఆత్మకూర్‌లో..

పాన్‌గల్: బాల్య వివాహాలు చేయడం చట్టారీత్యా నేరమని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ నరేందర్ అన్నారు. గురువారం మండలంలోని కేతేపల్లిలో మహిళ శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు బాల్య వివాహాల నిరోధం, బాలల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ పిల్లలను మగవారితో సమానంగా చదివించాలని, బాలల హక్కులను కాపాడాలన్నారు. బాలల రక్షణ చట్టాలు, హక్కులు, అక్రమ రవాణా, బాల్య వివాహాల నిషేధ చట్టం 2016, బాలలపై లైగింక వేధింపుల నిరోధ చట్టం 2012, బాల కార్మిక నిషేధ చట్టం 2016, యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్లు 1098, 112, 100 నెంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ భీరయ్య, మహిళ సంఘం సభ్యులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

గోపాల్‌పేట: బాలబాలికలు తమ హక్కులను సంపూర్ణంగా పొందేందుకు ప్రతి ఒక్కరూ సహాయపడాలని చైల్డ్‌హెల్ప్‌లైన్ సభ్యుడు రాజేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన రేవల్లి మండలంలోని చెన్నారంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహ, బాల కార్మిక నిషేధ చట్టం తదితర వాటి గురించి వివరించారు. పిల్లలను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే 100 లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కేస్ వర్కర్ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: బాల్య వివాహాల వల్ల ఎన్నో రకాల అనార్థాలు చోటుచేసుకుంటాయని, ఈ దురాచారాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం నిర్వాహకుడు నరేష్ అన్నారు. గురువారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నతనంలోనే వివాహం చేయడంతో బాలిక ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో పాటు శిశువులు అనారోగ్యంగా పుడతారని, మరణాలు కూడా సంభవించే ప్రమాదం ఉందనా ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే అమ్మాయిల గుడ్ టచ్, బ్యాడ్ టచ్, లైంగికదాడులు, వేధింపులపై వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు రవిరాజు, హెచ్‌ఎం మద్దిలేటి, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు నీడ ఏర్పాటు చేయాలి



షాపురంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటాచారి

ఖిల్లాఘనపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీలకు పని ప్రదేశంలో నీడ ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ వెంకటాచారి అన్నారు. గురువారం మండలంలోని షాపురం గ్రామంలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండ తీవ్రత పెరుగుతుందని, కూలీలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఉదయం త్వరగా పనులకు వచ్చి మధ్యాహ్నం వరకు పనులు చేసి వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువుల్లో ఒండ్రుమట్టి తీసే పనులు ఎక్కువగా చేయించాలన్నారు. అదేవిధంగా చెరువులకు వర్షపు నీళ్ల వెళ్లే పాటు కాల్వలు తీయించాలని చెప్పారు. పాటు కాల్వలు శుభ్రంగా ఉండటం వలన చెరువుల్లోకి సాగు, వర్షపు నీరు త్వరగా చేరడానికి అవకాశం ఉంటుందన్నారు. పనులకు వచ్చే కూలీలు వెంట తాగునీటిని తెచ్చుకునేలా సూచనలు చేయాలన్నారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..



ఆత్మకూర్‌లోని డివైడర్ నిర్మాణం



అమరచింతలో పెచ్చులూడుతున్న డివైడర్, గుంతలమయంగా రహదారి

- డివైడర్ నిర్మాణంలో రూ.46 లక్షలు వృథా

అమరచింత: స్థానిక మున్సిపాలిటీలో రోడ్ డివైడర్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. జనాభా ప్రతిపాదికన జిల్లాలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో మంజూరైన నిధులతో డివైడర్ల నిర్మాణాలు చేపట్టారు. అన్ని మున్సిపాలిటీల్లో రాతితో డివైడర్‌ను నిర్మిస్తే అమరచింతలో మాత్రం రూ.46 లక్షలు వెచ్చించి లైట్‌వెయిట్ ఇటుక పెల్లలతో నిర్మాణం పూర్తి చేశారు. నిర్మాణం జరిగి ఏడాది కాకముందే వాహనాల తాకిడికే కూలిపోతున్నది. డివైడర్ రెండేళ్ల కాలానికే శిథిలావస్థకు చేరింది. అధికారులు స్పందించి సదరు కాంట్రాక్టర్, ఏఈలపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకర బావికి రక్షణ గోడ నిర్మించండి



ప్రధాన రోడ్డుపై రక్షణ గోడ లేని బావి

వీపనగండ్ల: మండలంలోని కల్వరా సమీపంలో ప్రధాన మలుపు వద్ద ప్రమాదకరమైన బావి ఉండడం, దానికి రక్షణ గోడ నిర్మించకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. రాత్రి వేళలో వాహనదారులు అదుపు తప్పి బావిలో పడే ప్రమాదం ఉందని, అధికారులు స్పందించి మూలమలుపు వద్ద ఉన్న బావికి తక్షణమే రక్షణ గోడ ఏర్పాటుతో పాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ ఓటు కోసం తరలిన కౌన్సిలర్లు



అమరచింత: ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకునేందుకు మండలంలోని ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు గురువారం జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా ఏర్పాటు చేసిన పోలింగ్‌లో పాల్గొని తమ తమ పార్టీలు బలపర్చిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించేందుకు వెళ్లామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి తెలిపారు. మండలంలో ఐదు మంది ఎంపీటీసీలతో పాటు 10 మంది కౌన్సిలర్లు, జెడ్పీటీసీ ఓటు హక్కును వినియోగించుకున్నారు.